భూ సేకరణకు రైతులు సహకరించాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టు కాలువ వెడల్పు పెంచేందుకు రైతులు భూసేకరణకు సహకరించాలని భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జి.సూర్యనారాయణరెడ్డి కోరారు. మండలంలోని పుట్రేపు, బండివారిగూడెం, గంగినీడుపాలెం గ్రామాల్లోని చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు భూసేకరణకు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుండి అదనపు భూసేకరణకు నష్ట పరిహారం త్వరగా అందించడానికి కృషి చేస్తానన్నారు. రైతులు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జెవి.సుబ్బారావు, విఆర్ఒలు గోపి, పుల్లారావు, హెచ్.పుల్లారావు పలువురు రైతులు పాల్గొన్నారు.

ధాన్యం.. దైన్యం..!

ఇప్పటికీ వీడని కొనుగోలు సమస్యలు

బ్యాంకు గ్యారెంటీ సమస్యతో రైతులకు ముప్పతిప్పలు

రోడ్డెక్కుతున్న రైతులు

తేమశాతంలో తేడా సమస్యపై తీవ్ర ఆగ్రహం

రబీలో ధాన్యం కొనుగోలుపై రైతుల్లో ఇప్పటి నుంచే బెంగ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ధాన్యం కొనుగోలు సమస్య అత్యంత ఇబ్బందికరంగా మారింది. ధాన్యం కొనుగోలు ప్రారంభించి నెల రోజులు గడుస్తున్నా ఇప్పటికీ రైతులను సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. ఆదిలో లారీలు, గోనెసంచులు, యాప్ సమస్యతో సతమతమైన రైతులు ఇప్పుడు బ్యాంకు గ్యారెంటీ సమస్యతో నలిగిపోతున్నారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో ఏలూరు జిల్లాలోని రైతులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. రెండు జిల్లాలవ్యాప్తంగా ఖరీఫ్‌లో దాదాపు 4.50 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. పశ్చిమలో 3.42 లక్షలు, ఏలూరు జిల్లాలో 3.80 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ఇప్పటి వరకూ రెండొంతుల ధాన్యం కొనుగోలు చేసినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఏలూరు జిల్లాలో ఇంకా లక్ష టన్నుల వరకూ ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. పశ్చిమలోనూ ఇంకా ధాన్యం కొనుగోలు జరగాల్సి ఉంది. రబీ మాసూళ్లు పూర్తవుతున్నా ఇంకా ఖరీఫ్ ధాన్యం కొనుగోలు చేయని దుస్థితి నెలకొంది. మాసూళ్లు చేసి పది రోజులు గడిస్తే తప్ప ఏఒక్క రైతు నుంచీ ధాన్యం కొనుగోలు చేయడం లేదు. ముఖ్యంగా రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య తేమ శాతం. ఆర్‌బికె సిబ్బంది 17శాతంలోపు తేమ ఉందని నిర్ధారించి ధాన్యం లారీల్లో పంపిన తర్వాత మిల్లుల వద్ద 20 శాతం, ఆపైన తేమ ఉందని ధాన్యం దింపుకునేందుకు మిల్లర్లు ససేమిరా అంటున్నారు. దీంతో రైతులు ఏం చేయాలో తెలీక తేమశాతానికి సంబంధించి సొమ్ము చెల్లించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. శనివారం జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలోనూ జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు ఇదే విషయమై ప్రశ్నించగా వ్యవసాయ, పౌరసరఫరాల శాఖ అధికారులు సంతృప్తికరమైన సమాధానాలు ఇవ్వలేని దుస్థితి నెలకొంది. మిల్లర్లకు, ఆర్‌బికెలకు మధ్య తేమశాతం ఎందుకు తేడా వస్తుందో సరైన సమాధానం చెప్పడం లేదు. తేమశాతం సమస్య రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. బ్యాంకు గ్యారెంటీలు అయిపోయాయంటూ ధాన్యం లోడు చేసిన తర్వాత

ఆగిపోవడంతో ఏలూరు మండలం జాలిపూడిలో రైతులు రోడ్డెక్కి ధర్నా చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. దీన్నిబట్టి ఇప్పటికీ ధాన్యం కొనుగోలు ఇబ్బందులతో రైతులు ఏవిధంగా నలిగిపోతున్నారో స్పష్టమవుతోంది. ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు లేకుండా చేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం వల్లే సమస్యలు వెంటాడుతున్నట్లు రైతుల్లో చర్చ సాగుతోంది. బ్యాంకు గ్యారెంటీలపై అప్రమత్తత లేకపోవడం కారణంగానే రైతులకు తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయని తెలుస్తోంది.

రబీలో ధాన్యం కొనుగోలుపై ఇప్పటినుంచే బెంగ

ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో తీవ్ర ఇబ్బందులు చవిచూసిన రైతులు రబీపై ఇప్పటి నుంచే బెంగ పెట్టుకుంటున్నారు. రబీకి సంబంధించి ఇప్పటికే సగానికిపైగా నాట్లు పూర్తయ్యాయి. సంక్రాంతికి పూర్తిస్థాయిలో రబీ నాట్లు పూర్తయ్యే అవకాశం ఉంది. ఏప్రిల్ నుంచి రబీ మాసూళ్లు ప్రారంభమయ్యే పరిస్థితి ఉంది. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఖరీఫ్ మాదిరిగా ఇబ్బందులు ఉంటే పరిస్థితి ఏమిటనే భయం అన్నదాతను వెంటాడుతోంది. రబీలోనైనా ధాన్యం కొనుగోలు సమస్య లేకుండా చేయగలరా అనే చర్చ రైతుల్లో నడుస్తోంది. ధాన్యం కొనుగోలులో ఇబ్బందులతో వరిసాగుపై రైతుల్లో విరక్తి నెలకొంది. రబీ ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వం ఇప్పటి నుంచే సరైన ప్రణాళికతో ముందుకు సాగకపోతే రైతుల ఆగ్రహం చవిచూడక తప్పదు.

'పోలవరం' త్యాగధనులను విస్మరించడం దుర్మార్గం

ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సర్వం త్యాగం చేసిన నిర్వాసితులను గాలికి వదిలేయడం దుర్మార్గమని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి అన్నారు. గురువారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట నిర్వాసితులతో బైటాయించి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం అధ్యక్షతన పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సంఘం, ఎపి గిరిజన సంఘం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎ.రవి మాట్లాడుతూ జాతీయ ప్రాజెక్టు హోదాతో ఆంధ్రుల జీవనాడిగా పేరొందిన పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. పోలవరం ప్రాజెక్ట్ గత 15 ఏళ్లుగా నిర్మిస్తున్నారని, అధికారంలోకి వచ్చిన ప్రతిఒక్కరూ ప్రాజెక్ట్‌ను పూర్తి చేస్తామంటూ చెబుతున్నారే తప్ప నిర్వాసితులకు పునరావాసం, పరిహారం కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారన్నారని మండిపడ్డారు. నిర్వాసితుల త్యాగాల పునాదులపై పోలవరం ప్రాజెక్టు నిర్మిస్తున్నామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పదేపదే చెబుతూ నిర్వాసితులను గాలికి వదిలేశారని విమర్శించారు. పాలకులకు ప్రాజెక్టు నిర్మాణంలో ఉన్న శ్రద్ధ నిర్వాసితులకు వసతులు కల్పించడంలో చిత్తశుద్ధి లేదన్నారు. 2022లో గోదావరి వరదలే ప్రామాణికంగా తీసుకుని ఆ గ్రామాలకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులను తరలించే నాటికి పునరావాస పరిహారం పూర్తి చేసి తరలించాలని 2013 భూ సేకరణ చట్టం స్పష్టంగా చెబుతుందన్నారు. అధికారుల, పాలకుల మెప్పు కోసం నిర్వాసితులను గ్రామాల నుంచి ఖాళీ చేయిస్తున్నారని విమర్శించారు. గ్రామాల నుంచి వెళ్లగొట్టిన తర్వాత ఏ ఒక్క అధికారి కూడా పునరావాస గ్రామాలకు వెళ్లడం లేదన్నారు. ఇప్పుడు పదేపదే గ్రామ సభలు పెట్టి నిర్వాసితులను నిబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని వరదల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు.

నిర్వాసితులను తరలించే నాటికి 18 ఏళ్ల యువతీ యువకులకు ప్యాకేజీ ఇవ్వాలని 2017 కట్ ఆఫ్ తేదీని మార్చాలని డిమాండ్ చేశారు. నిర్వాసిత గ్రామాల్లో యువతకు ప్రత్యామ్నాయ ఉపాధిగా కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, ఇంటికో ఉద్యోగం కల్పించాలన్నారు. పునరావాస కాలనీల్లో చనిపోయిన వారికి దహనం చేసేందుకు చారెడు భూమి లేదన్నారు. తక్షణం అన్ని కాలనీలకు శ్మశాన వాటిక స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎపి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణంను ఒకరిపై ఒకరు పోటీపడుతూ ప్రాజెక్టు నిర్మాణంపైనే ఎక్కువ దృష్టి సారించారన్నారు. లక్షలాది కుటుంబాలు పోలవరం ప్రాజెక్టు వల్ల నిర్వాసితులవుతున్నా వారి సంక్షేమాన్ని ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. చాలా నిర్వాసితగ్రామాల్లో భూమికి భూమి ఇవ్వలేదని ఇచ్చినచోట్ల వివాదాల భూమిలే ఎక్కువగా కేటాయించారన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో సాగు భూములు పోడు భూములు కోల్పోయిన వారికీ భూమికి భూమి పరిహారం పూర్తి స్థాయిలో ఇవ్వలేదన్నారు. అటవీ శాఖకు భూములను ఈ ప్రాంతాల్లో కేటాయిస్తున్నారని, నిర్వాసితుల గ్రామాలకు అటవీ భూములు ఎందుకు కేటాయించడం లేదన్నారు. వరదల సమయంలో ఇల్లు కూలిపోయిన వాళ్లకి పరిహారం ఇవ్వలేదని ఇంకాఎప్పటికి ఇస్తారని ఆయన ప్రశ్నించారు. ఇల్లు లేక ఇబ్బందులతో సతమవుతున్న నిర్వాసితులను అధికారులు సర్వేల పేరుతో వారి దగ్గరకు రప్పించడం సరైన పద్ధతి కాదన్నారు. పునరావాస కాలనీలో పాఠశాల, అంగన్వాడి భవనాలను తక్షణం ప్రారంభించాలన్నారు. పునరావాస కాలనీలకు తాగునీరు కల్పించాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించక పోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు తామ ముత్యాలమ్మ, జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, ఉపాధ్యక్షులు వై.నాగేంద్ర రావు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ధర్ముల రమేష్, ఉపాధ్యక్షులు చంద్రు బుల్లెమ్మ, పోలోజు నాగేశ్వరరావు, కారం భాస్కర్, నిర్వాసితుల సంఘం జిల్లా నాయకులు గుడెల్లి వెంకట్రావు, సిఐటియు జిల్లా నాయకులు ఎం.దుర్గారావు, ఎస్‌కె.సుభాషిణి, నిర్వాసితులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ధాన్యంపై పరదాలు కప్పుతున్న రైతులు

ముదినేపల్లిలో వర్షం

ధాన్యం రక్షించుకునేందుకు రైతుల అవస్థలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో గురువారం మోస్తరు వర్షం కురిసింది. దీంతో రైతులు ధాన్యాన్ని రక్షించుకునేందుకు ఉరుకు పరుగులు పెట్టారు. తెల్లవారుజామున మండలంలో చినపాలపర్రు, పెయ్యేరు గురజ, వడాలి, అన్నవరం ముదినేపల్లి తదితర గ్రామాల్లో ఈదురు గాలులతో వర్షం కురిసింది. దీంతో మాసూళ్లకు వెళ్లే కూలీలు వాన రాకతో నిలిచిపోయారు. మళ్లీ మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో మండలంలోని పెదపాలపర్రులో వర్షం కురిసింది. దీంతో రైతులు ఖాళీ స్థలాల్లో, కల్లాల్లో, రోడ్ల వెంబడి తేమ శాతం తగ్గించేందుకు అరబెట్టుకున్న ధాన్యాన్ని రాశులుగా చేసి వాటిపై పరదాలు కప్పి ధాన్యం కాపాడుకునేందుకు నానాఅవస్థలు పడ్డారు. అదేవిధంగా కుప్పలు తడిసి ధాన్యం పాయ వచ్చే అవకాశం ఉన్నందున రైతులు కుప్పలపై కూడా పరదాలు కప్పి ధాన్యం తడిసిపోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ముదినేపల్లి - గుడివాడ రహదారి వెంబడి మార్జిన్‌లో అరబెట్టిన ధాన్యం రైతులు సంచుల్లో ఎత్తి రక్షించుకునేందుకు నానాతంటాలు పడ్డారు. కల్వపూడిసత్రం వద్ద పెదపాలపర్రుకు చెందిన రైతు కృష్ణ అరబెట్టిన ధాన్యం వర్షానికి తడిసిపోవడంతో నానా తంటాలు పడ్డాడు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం తెచ్చిన కొత్త విధానం కారణంగా పంట కోసి, నూర్పిళ్లు చేసి నెల రోజులు కావొచ్చినా నేటికి ధాన్యం కొనే నాధుడు లేకుండా పోయడంటూ కౌలు రైతు శేషుబాబు అవేదన వ్యక్తం చేశాడు. మండల వ్యవసాయశాఖ అధికారి బొర్రా వేణుమాధవ్ ప్రజాశక్తితో మాట్లాడుతూ మండలంలో నూరు శాతం వ్యవసాయ పనులు పూర్తయ్యాయన్నారు. రైతులు పంటను చాల గ్రామాల్లో కుప్పలుగా వేశారన్నారు. పలుచోట్ల రైతులు తేమశాతం తగ్గించేందుకు అరబెట్టిన ధాన్యం వర్షానికి తడిసిపోకుండా రైతులు పరదాలు కప్పి రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

ఘనంగా ఎంఎల్‌సి షేక్ సాబ్జీ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఎంఎల్‌సి షేక్ సాబ్జీ పుట్టినరోజు వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. సత్రంపాడులోని ఎమ్మెల్సీ క్యాంప్ కార్యాలయంలో యుటిఎఫ్ ఏలూరు మండల శాఖ, వివిధ అధికారులు, తదితరులు సమక్షంలో షేక్ సాబ్జీ 57వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాబ్జీ మాట్లాడుతూ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఉద్యోగుల, కార్మికుల, కర్షకుల, దళిత, పేద, అణగారిన వర్గాల సమస్యల పరిష్కారం కోసం, వారి అభ్యున్నతి, కోసం, ప్రభుత్వ విద్యారంగం లోపేతానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నంబూరి రాంబాబు, యుటిఎఫ్ మండల శాఖ నాయకులు పి.సురేష్‌బాబు, శ్రీనివాస్ కుమార్, ఎల్.కనకదుర్గ, సుభానీ బేగం, ప్రభాకర్, బి.శ్రీనివాస్, బి.రవిశోభన్, మాధవి లత, విజయానంద్, మురళీ, రాము, జనార్ధన్, రామకృష్ణ, సుబ్బారావు, రజనీ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్ కృష్ణజ్యోతి

కోడిపందేలపై ఉక్కుపాదం

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలో కోడిపందేలు, గుండాట, జూదాలు, అక్రమ మద్యం రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు నిరంతరం పర్యవేక్షించాలని తహశీల్దార్ కృష్ణజ్యోతి, సిఐ మల్లేశ్వరరావు అన్నారు. చింతలపూడి పట్టణంలో ఎంపిడిఒ కార్యాలయం వద్ద మహిళా కానిస్టేబుల్స్, విఆర్‌ఒలు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోడిపందేలు నిర్వహించాలంటే భయపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. కోడిపందేల నియంత్రణపై గతంలో గౌరవ హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడైనా కోడిపందేల జరిగితే సంబంధిత గ్రామ, కమిటీలే బాధ్యత వహిచాల్సి వస్తుందని స్పష్టం చేశారు. హైకోర్టు ఆదేశాల సమాచారాన్ని కూడా స్పష్టంగా ఆయా బ్యానర్‌లో ప్రదర్శించాలన్నారు. కోడిపందేలు నిర్వహించేందుకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో మరింత నిఘా ఉంచాలన్నారు. నాటుసారా, అక్రమ మద్యం నియంత్రణపై మరింత నిఘా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ హరికృష్ణ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయులు అన్నే వెంకటేశ్వరరావు

నేడు వర్ధంతి సభ

ప్రజాశక్తి - ఏలూరు

ఆదర్శప్రాయులు, అమరజీవి, స్వాతంత్ర్య సమరయోధులు, రైతు-ప్రజా నేత అన్నే వెంకటేశ్వరరావు 20వ వర్ధంతి సభ ఈనెల ఆరో తేదీన ఏలూరులో జరగనుంది. ఆయన కృష్ణాజిల్లా ఆత్కూరులో 1916లో జన్మించారు. తల్లిదండ్రులు 1927లో ఆత్కూరు నుండి ఏలూరు రూరల్ మండలం సత్రంపాడుకు వచ్చి స్థిరపడ్డారు. ఆయన తన 15వ ఏట ఏలూరులో గాంధీ పిలుపుమేరకు ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొన్నారు. అరెస్టయ్యి తొమ్మిది నెలలు జైలు జీవితం గడపడం ద్వారా ప్రజా జీవితాన్ని ఆరంభించారు. ప్రముఖ నేతలు పుచ్చలపల్లి సుందరయ్య, గారపాటి సత్యనారాయణ సహచర్యం, గోర్కి 'అమ్మ' నవల చదవడంతో ఉత్తేజం పొందారు. తొలుత కాంగ్రెస్‌లో, తర్వాత కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీలో, ఆ తరువాత కమ్యూనిస్టు పార్టీలో చేరి అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారు. బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించిన 'స్వతంత్ర భారత్' పత్రికను అన్నే సంచిలో పెట్టిన పోలీసులు, ఆయనను అరెస్టు చేసి జైలు శిక్ష వేయించి కోయంబత్తూరు జైలుకు పంపారు.



పోరుబాటలో అన్నే వెంకటేశ్వరరావు జీవితం

1948లో రాజమండ్రిలో, 1949లో సేలంలో, 1964లో చంచల్‌గూడలో, 1968లో అండమాన్ జైలులో శిక్షలు అనుభవించారు. మొత్తంగా 12 సంవత్సరాల పాటు జైలు జీవితం గడిపారు. బ్రిటిష్ కాలంలోనే పెదపాడు, రాజుపేట, నాయుడుగూడెంలో జమిందారీ వ్యతిరేక పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్నారు. హుకుంపేట, బుచ్చిపాలెం, పెండ్యాల, కానూరు అగ్రహారం పేదల ఉద్యమాలతో సన్నిహిత సంబంధం కలిగి ఉన్నారు. కొల్లేరులోని గుడివాకలంక, పత్తికోళ్లలంక మోతేవారిలంక, పంగిడిగూడెం, శ్రీపర్రులో, నిడమర్రు మండలంలోనూ భూస్వాముల పెత్తనానికి వ్యతిరేకంగా ఉద్యమాలు నడపడంలో ముఖ్యపాత్ర వహించారు. వేలాది ఎకరాలు దళిత, పేదల స్వాధీనంలోకి రావడానికి జరిగిన ఉద్యమాలు, కృషిలో అన్నే వెంకటేశ్వరరావు ముఖ్యపాత్ర పోషించారు.

నిరంతర అధ్యయనం - ఆందోళనల మయం

అన్నే వెంకటేశ్వరరావు మంచి అధ్యయన శీలి. చిన్నప్పటి నుంచి అభ్యుదయ సాహిత్యం, దినపత్రికలు చదివేవారు. జైలులోనే ఇంగ్లీషు నేర్చుకున్నారు. కంటిచూపు ఇబ్బంది ఉన్నా చివరి వరకూ భూతద్దంతో పత్రికలు, సాహిత్యం చదువుతూ అంతర్జాతీయ, జాతీయ పరిస్థితులపై అవగాహనతో సహచరులతో చర్చించేవారు. తెలుగు పత్రికలతో పాటుగా హిందూ పత్రికను చదివేవారు. ప్రభుత్వ డాక్యుమెంట్లు చదవడం ద్వారా తెలుసుకుని అందరికీ అర్థమయ్యే భాషలో కరపత్రాలు, వ్యాసాలు, నోట్ లు రాసేవారు. కొల్లేరు సమస్యల లోతుపాతులపై ఒక పుస్తకం కూడా రాశారు. ఆయన కరపత్రాలు జనం భాషలో పదునైన పదాలతో ఉండేవి.

నిరాడంబరం, ఉత్తేజభరితం అన్నే జీవితం

ఏలూరు పట్టణంలో అన్నిచోట్లకు, ఏలూరు తాలూకా గ్రామాలన్నింటా సైకిల్‌పైనే విస్తతంగా తిరిగి ప్రజాసమస్యలపై ఉద్యమాలు సాగించారు. 80 ఏళ్ల వయసులోనూ సైకిల్ మీదే తిరిగేవారు. ప్రతి ప్రజా సమస్య మీద స్పందించి అధికారుల వద్దకు నిరంతరం ప్రజలను తీసుకెళ్లి రాయబారాలు చేసేవారు. వేషధారణలోను, వ్యవహార శైలిలోను నిరాడంబరత, నమ్రత సహజంగా కనిపించేవి. అన్నే వెంకటేశ్వరరావు కష్టాలను ఎదుర్కొనడంలో అనేక ఉద్యమాలు సాగించడంలో ఆయన జీవితభాగస్వామి, ఉద్యమ సహచరి అన్నే అనసూయమ్మ తోడునీడగా ఉండేవారు. భార్యాభర్తలుగానే కాక ఉద్యమ సహచరులుగా వారిద్దరి జీవితం పెనవేసుకుపోయింది. అన్నే వెంకటేశ్వరరావు 2003 జనవరి ఆరో తేదీన తుదిశ్వాస విడిచారు. ఆయన ఏ పరిస్థితుల్లో ఉన్నా మార్పు కోసం అయితే జీవితాంతం కృషి చేశారో ఆ పరిస్థితులు నేడు మరింత ప్రాధాన్యత సంచరించుకున్నాయి.

ప్రజా కవి సుంకర సత్యనారాయణ సోదరి అన్నే అనసూయతో రాజకీయ పాఠశాలలో ఏర్పడిన పరిచయంతో 1944 ఏప్రిల్ 24న వివాహం జరిగింది. ఆ విధంగా అనసూయ కోరి మరి ప్రజాఉద్యమాలను జీవితంలో భాగం చేసుకున్నారు. జీవితంలో అనేక ఆటు పోట్లు వచ్చినా, ధీరోదాత్తంగా ఎదుర్కొన్నారు. జీవితాంతం ప్రజల ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. కుమారుడు రవి, కుమార్తె కల్పన చిన్నపిల్లలుగా ఉన్నప్పుడే వారిని కూడా తీసుకుని రాయవెల్లూరు, నందిగామ జైళ్లలో రెండు సంవత్సరాలు జైలు జీవితం గడిపారు. భర్త ఉద్యమాలు, 12 ఏళ్ల జైలు జీవితం అనుభవించిన కాలంలో ఎల్ఐసి ఏజెంటుగా పనిచేసి కుటుంబాన్ని పోషించారు. కుటుంబంలోని వారందరిని మూఢ, మత భావాలకు వ్యతిరేకంగా అభ్యుదయ భావాలతో ఉండేలా పెంచారు.

అన్నే అనసూయ, వెంకటేశ్వరరావు పేరుతో విజ్ఞాన కేంద్రం

స్వాతంత్ర్య ఉద్యమం, కొల్లేరు ప్రాంత, అటవీ హక్కుల, పేదలు ఉద్యమాలతో సంబంధాలు కలిగి ఉన్న సమరయోధులు, త్యాగమయ జీవితాలు గడిపిన అన్నే వెంకటేశ్వరరావు, అన్నే అనసూయల పేరుతో ఏలూరులో అన్నే అనసూయ, వెంకటేశ్వరరావు విజ్ఞాన కేంద్రం 2019లో ప్రారంభించారు.

నేడు పవర్‌పేటలోని ఉద్దరాజు భవనంలో సదస్సు

హాజరుకానున్న ఎంఎల్‌సిలు

అన్నే వెంకటేశ్వరరావు వర్ధంతి సందర్భంగా శుక్రవారం సాయంత్రం 4 గంటలకు పవర్‌పేటలోని ఉద్దరాజు రామం భవనంలో సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథులుగా ఎంఎల్‌సిలు కెఎస్.లక్ష్మణరావు అతిథిగా ఎంఎల్‌సి షేక్ సాబ్జీ పాల్గొంటారు. ఏలూరు నగరంలోని అన్ని కాలేజీల్లో ఐదో తేదీన విడివిడిగా 'భారత స్వాతంత్ర్య పోరాటంలో పశ్చిమ గోదావరి జిల్లా వాసుల పాత్ర' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి అందులో ప్రతీ కాలేజీ నుండి ముగ్గురికి ఆరో తేదీ సభలో బహుమతులు ఇవ్వనున్నారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కంప్యూటర్ శిక్షణా కేంద్రం 18వ బ్యాచ్ అభ్యర్థులకు సర్టిఫికెట్ల ప్రదానం, హేలాపురి బాలోత్సవం సెంటర్స్ టీచరు, విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేస్తారు.

జిఒ 1 రద్దు కోరుతూ సిపిఎం నిరసన

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర ప్రభుత్వం 2023 తీసుకొచ్చిన జిఒ-1ను రద్దు చేయాలని సిపిఎం పెంటపాడు మండల కమిటీ ఖండించింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా సెక్రటరీ సభ్యులు చింతకాయల బాబూరావు మాట్లాడుతూ జిఒ వల్ల ప్రతిపక్షాలకు, ప్రజా సంఘాలకు చాలా ఇబ్బంది పడే పరిస్థితి ఉందన్నారు. మన రాజ్యాంగంలో ప్రతి మనిషి మాట్లాడే హక్కు, నిరసన తెలియజేసే హక్కు రాజ్యాంగంలో ఉందని, అలాంటి అంశాన్ని మున్సిపాలిటీలో, పంచాయతీలో, ఎవరూ రోడ్లమీద ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు నిషేధమని రాష్ట్ర ప్రభుత్వం చెప్పటం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఎప్పుడో బ్రిటిష్ గవర్నమెంట్ కాలంలో 1861లో పోలీస్ చట్టాన్ని తలపించేలా ఈ జిఒ ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అవసరాలకు తగ్గట్టుగా పరిపాలన సాగిస్తే ఈ ఉద్యమాలు, పోరాటాలు ఉండవన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభించడం వల్ల ఈ ఉద్యమాలు, పోరాటాలు వస్తున్నాయని తెలిపారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్న వైసిపి ప్రభుత్వం మూడు వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసినప్పుడు రోడ్ల మీద కాకుండా ఎక్కడ తిరిగారని ప్రశ్నించారు. అధికారం ఉందని ఇష్టం వచ్చినట్లు జిఒలు ఇచ్చి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో పెంటపాడు సిపిఎం మండల కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి, బంకురు నాగేశ్వరరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, సిరపరపు రంగారావు, పెనగంటి దుర్గ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : రాష్ట్రంలో నిరంకుశ పాలనకు అద్దంపట్టేలా వైసిపి ప్రభుత్వం తీసుకువచ్చిన జిఒ-1 రద్దు చేయాలని టిడిపి నాయకులు నిరసన చేపట్టారు. టిడిపి మండల అధ్యక్షుడు ఎస్.సత్యనారాయణ అధ్యక్షతన స్థానిక బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల రెబ్బన్లు చేతులకు కట్టుకుని వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ వైఫల్యాలపై తన గళాన్ని విప్పుతున్న మీడియాపై ఇదే విధమైన జిఒ తీసుకొచ్చి మీడియా గొంతు నొక్కే ప్రయత్నం చేశారన్నారు. నేడు ప్రశ్నించే ప్రజలపై ప్రజల తరుపున పోరాడే ప్రతిపక్షాలపై విషం కక్కుతూ చీకటి జిఒను ప్రభుత్వం తీసుకువచ్చిందని అన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జిఒ ప్రతులను రద్దు చేయాలని వినతిపత్రం సమర్పించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, నంబూరి రామచంద్రరాజు, బొబ్బర రాజుపాల్, మిడత పెంటయ్య, గొల్లమందల శ్రీనివాస్, నంగునూరు జగత్, ఇస్మాయిల్, బూసా సత్యనారాయణ, గంటా రామారావు, సీలామంతుల రాంబాబు, కోనేటి చంటి, కాసాని ప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోరాటాలకు చిరునామా యుటిఎఫ్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఉపాధ్యాయ పోరాటాలకు యుటిఎఫ్ చిరునామాగా నిలిచిందని యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎంవి.శ్యాంబాబు అన్నారు. డిసెంబర్ నాలుగో తేదీ రాత్రి స్థానిక యుటిఎఫ్ డివిజన్ భవనంలో మండల శాఖ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అధికారిగా జిల్లా గౌరవ అధ్యక్షులు శ్యాంబాబు వ్యవహరించారు. ఏకగ్రీవంగా జరిగిన ఎన్నికల్లో అధ్యక్షులుగా షేక్ తడాహికో, జనరల్ సెక్రటరీగా టి.రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా ఎం.మురళీమోహన్, కోశాధికారిగా ఎస్‌కెఎన్ఎం.షరీఫ్ ఎన్నుకున్నారు. అనంతరం ఎంవి శ్యామ్‌బాబు మాట్లాడుతూ కార్యకర్తలు తమ హక్కులు, బాధ్యతలు తెలుసుకుని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని తెలిపారు. జిల్లా కార్యదర్శి అల్లాడి రాజు మాట్లాడుతూ గిరిజన ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్ చేసిన పోరాటాలను వివరించారు. ఉద్యమానికి సహకరించకపోతే తీవ్రంగా నష్టపోతామని చెప్పారు. తొలుత సావిత్రి బాయి పూలే, యుటిఎఫ్ వ్యవస్థాపకులు పోలిశెట్టి చిత్రపటాలకు పుష్ప మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిట్ మెంబర్ ఎం.ఎ.నబీ, నూతన గౌరవ అధ్యక్షులు ఎన్.యేసురత్నం, జిల్లా కార్యదర్శులు, మండల బాధ్యులు పాల్గొన్నారు.

సావిత్రిబాయిపూలే, పోలిశెట్టి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నాయకులు

మిర్చి తోటలను పరిశీలిస్తున్న అధికారులు

మిర్చి తోటల పరిశీలన

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని వలసపల్లి, గుడిపాడు, గుళ్లపూడి గ్రామాల్లో మిర్చి తోటలను ఏలూరు జిల్లా ఉద్యానవనశాఖ సైంటిస్టు కో-ఆర్డినేటర్ ఫణికుమార్, ముసునూరు మండల వ్యవసాయాధికారి సిహెచ్.శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. నులిపురుగు (తామరపురుగు) వల్ల నష్టపోతున్న మిర్చి రైతులను ఆదుకోవాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించిన వార్త ప్రజాశక్తిలో ప్రచురితమవ్వడంతో ఉద్యానవన, వ్యవసాయ శాఖ అధికారులు స్పందించారు. మిర్చి తోటలను రైతులతో కలిసి పరిశీలించి వారికి పలు సలహాలు, సూచనలు అందించారు. పంట నష్టపోకుండా ఉండేలా రైతులకు రసాయనిక, క్రిమి సంహారక మందులు ఎలా వాడాలో తెలిపారు.

ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - కైకలూరు రూరల్

అర్హులై ఇళ్లు లేని పేదలందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లను నిర్మించుకోవడానికి ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షలు ప్రభుత్వం అందిస్తుందని, త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టి పూర్తి చేసుకోవాలని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. కైకలూరులోని వైఎస్ఆర్ జగనన్న గ్రీన్ విలేజ్‌లో ఇళ్ల పట్టాలు పొంది ఇళ్ల నిర్మాణం మొదలుపెట్టని అధికారులతో ఆయన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆశీస్సులతో ఉమ్మడి కృష్ణా జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో అతి పెద్దదైన 94.5 ఎకరాలు సువిశాలమైన లేఅవుట్ తయారుచేసి ఆరడుగుల మేర మెరక చేయించి 2989 మంది లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు ఇచ్చినట్లు చెప్పారు. వెంటనే గృహ నిర్మాణాలు మొదలు పెట్టి ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అడివి కృష్ణమోహన్, వైస్ ఎంపిపి మహమ్మద్ జహీర్, గ్రామ సర్పంచి డిఎం నవరత్నకుమారి, తహశీల్దార్ మురళీకృష్ణ, ఎంపిడిఒ రామలింగేశ్వరావు, వాలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలని వినతి

ప్రజాశక్తి - చాట్రాయి

చాట్రాయిలో రైతులు సుమారుగా 600 ఎకరాలకు పైగా పయనీర్ 3567 మొక్కజొన్న పంట వేశారు. ఈ విత్తనం పంట దశకు రాకుండానే బ్యాక్టీరియా వైరస్ సోకి పంట పాడవడంతో అనేక మంది రైతులు నష్టపోయారు. పయనీర్ 3567 నాసిరకం విత్తనాలు అమ్మి కంపెనీ యజమానులు తమను మోసం చేశారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని కోరుతూ వ్యవసాయ శాఖ కార్యాలయం వద్దకు ర్యాలీగా వెళ్లి ఎఒ శివశంకర్‌కు వినతిపత్రం అందించారు. ఏరువాక సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఫణికుమార్ వ్యవసాయ శాఖ అధికారి శివశంకర్ కలిసి మొక్కజొన్న చేలను పరిశీలించారు. పంట నష్టపోకుండా రైతులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. పయనీర్ కంపెనీ వారితో మాట్లాడి రైతులకు న్యాయం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల నాయకులు తుమ్మల జగన్, రైతు సంఘం నాయకులు చలసాని రామారావు, జమలయ్య, రాయంకుల లక్ష్మణరావు పాల్గొన్నారు.

పలుచోట్ల 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి - భీమడోలు

కొల్లేరు ప్రాంతవాసుల అభ్యున్నతికి టిడిపి విశేష కృషి చేసిందని టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు తెలిపారు. మండలంలోని చెట్టున్నపాడులో ఇదేం ఖర్మ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి హయాంలో కొల్లేరు సరస్సుపై చేపల వేట ప్రధాన వృత్తిగా కలవారిని గుర్తించి వారికి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించామన్నారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో అవి అమలు కావడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు సిరి బత్తుల కొండబాబు, పార్టీ ఉంగుటూరు నియోజకవర్గ పరిశీలకులు షేక్ మీరా పాల్గొన్నారు.

కైకలూరు రూరల్ : పట్టణంలోని కాపుల బజారులో గురువారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు కాపుల వీధిలో ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు పెన్మెత్స త్రినాధరాజు, క్లస్టర్ ఇన్‌ఛార్జి పోలవరపు లక్ష్మీరాణి, మాల్యాద్రి, జానీ పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

రానున్న సంక్రాంతి పండుగను దృష్టిలో పెట్టుకొని కోడిపందేలు, పేకాట వంటి జూదాలను నిర్వహించకుండా మండలంలోని రెడ్డి గణపవరం గ్రామంలో గురువారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలవరం డిఎస్‌పి లతాకుమారి మాట్లాడుతూ కోడిపందేలు, పేకాట వంటి జూదాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బుట్టాయగూడెం ఎస్ఐ జయబాబు, గ్రామపంచాయతీ సెక్రటరీ కిరణ్ పాల్గొన్నారు.

మండవల్లి : కోడిపందేలు, పేకాట, గుండాట, అక్రమ మద్యం మద్యం రవాణా వంటి కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు కమిటీ సభ్యులు కృషి చేయాలని తహశీల్దార్ జనార్ధనరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కోడిపందేలు, గుండాట, పేకాట వంటి వాటిని నిర్వహించే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎంపిడిఒ పి.మల్లేశ్వరి మాట్లాడుతూ మహిళా పోలీసులు పోలీస్‌స్టేషన్‌కే పరిమితం అవ్వకుండా సచివాలయం పరిధిలో జరిగే కోడిపందేలు, పేకాట తదితర కార్యకలాపాలపై దృష్టి సారించాలన్నారు. కోడిపందేలు నివారించేందుకు ఏర్పాటుచేసిన కమిటీ సభ్యులు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ ఎడిఎ వరప్రసాద్, ఎస్ఐ రామకృష్ణ, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : కోడిపందేలు, గుండాట, పేకాట వంటి జూద క్రీడలకు దూరంగా ఉండాలని సిఐ బి.వెంకటేశ్వరరావు తెలిపారు. జీలుగుమిల్లి రామాలయం వద్ద కోడిపందేల నియంత్రణపై గ్రామస్తులకు బుధవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రజలందరూ కోడిపందేలు, జూదాలకు దూరంగా ఉండాలని అన్నారు. అందరూ కుటుంబ సభ్యులతో కలిసి సంప్రదాయ రీతిలో పండుగ జరుపుకోవాలని సూచించారు. గ్రామంలో ఎక్కడైనా కోడిపందేలు, పేకాట, గుండాట నిర్వహించినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, మహిళా పోలీస్ పాల్గొన్నారు.

సిపిఐ జాతీయ మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - నూజివీడు

సిపిఐ ఎంఎల్ లిబరేషన్ 11వ జాతీయ మహాసభ బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో ఫిబ్రవరి 15 నుంచి 20 వరకు జరగనున్నాయని, వాటిని విజయవంతం చేయాలని ఏలూరు జిల్లా కార్యదర్శి డి.హరినాథ్ విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని ఎఐఎస్ఎ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ మతోన్మాద ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మోడీ పాలనలో పేదవాడి పరిస్థితి మరింత దిగజారిందని విమర్శించారు. మోడీని గద్దె దించేందుకు అన్ని శక్తులు ఐక్యంగా కృషి చేయాలన్నారు. జగన్ తెచ్చిన జిఒ నెంబర్-1 రద్దు చేసేవరకూ పోరాడుతామన్నారు. విద్యార్థి నాయకుడు సాత్విక్ పాల్గొన్నారు.

గుండుగొలనులో ప్రత్యేక గ్రామసభ

ప్రజాశక్తి - భీమడోలు

గుండుగొలనులో నిర్వహించిన గ్రామసభ తీర్మానం మేరకు అర్హత కలిగి ఆక్వాజోన్‌లో నమోదు కాని చెరువుల వివరాలను నమోదు చేసుకునేందుకు మత్స్యశాఖ నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని గ్రామ ఉపసర్పంచి ముదుండి సూర్యనారాయణ రాజు కోరారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ఐదేళ్ల తర్వాత మరొక మారు నిర్వహించేందుకు చర్యలు తీసుకుందని తెలిపారు. గుండుగొలనులో గురువారం ప్రత్యేక గ్రామసభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరిశీలకులుగా మండల పరిషత్ అభ్యర్థి అధికారి రాఘవన్‌తో పాటు గృహ నిర్మాణ సంస్థ సహాయ ఇంజినీర్ సతీష్ పాల్గొన్నారు. గ్రామసభలో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించని 250 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించేందుకు చైతన్య పరచాలని కోరారు. గ్రామ పరిధిలో రూ.80 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఒహెచ్ఆర్ ట్యాంకు, పైపులైను పనులు ప్రారంభించాలని తీర్మానించారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పనితీరు మెరుగుపరచాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి వి.మురళీకృష్ణ మోహన్ పాల్గొన్నారు.

పలుచోట్ల 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలోని పూళ్ల గ్రామంలో గురువారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఎ వాసు బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హత కలిగి పథకాలు లబ్ధి చేకూరని వారు తనను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవానీరంగ, ఎంపిపి కె.ఆదాం, సర్పంచులు దాయం సుజాత, పి.సునీత మాన్‌సింగ్, ఎఎంసి చైర్ పర్సన్ ఇంజేటి నీలిమ జూనియర్ పాల్గొన్నారు.

మండవల్లి : మండలంలోని లోకమూడిలో గురువారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు పాల్గొన్నారు. సిఎం జగన్ ప్రజా సంక్షేమం కోరి అనేక సంక్షేమ పథకాలను చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్, సర్పంచులు మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ సర్పంచులు తలారి ధనలక్ష్మి, కరటి నాగలక్ష్మి, రైతు సంఘం నాయకులు చేయబోయిన వీర్రాజు, అధ్యక్షులు గోకర్ణ యాదవ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రజాసంక్షేమ పథకాలు ప్రజలందరికీ అందేలా చూడాలని ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి మోలుగుమాటి నీరజసుధాకర్ అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద మండల అధికారులతో, మండల అభివృద్ధిపై గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రజాభివృద్ధి కార్యక్రమలు ప్రజలకు అదించటంలో కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ మణికుమారి, మండల అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అస్తవ్యస్తంగా రహదారి విస్తరణ పనులు

ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు
పట్టించుకోని అధికారులు

కాలిపోయిన విద్యుత్ సామగ్రి చూపుతున్న గ్రామస్తుడు

ప్రజాశక్తి - మండవల్లి

జాతీయ రహదారి విస్తరణ పనులు గ్రామస్తుల పాలిట శాపంగా మారాయి. ప్రమాదాలు జరిగే విధంగా పనులు నిర్వహిస్తున్నప్పటికీ అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో గుత్తేదారుడు మరింత రెచ్చిపోయి విస్తరణ పనులు నిర్లక్ష్యంగా నిర్వహిస్తున్నాడు. దీంతో విద్యుత్ వైర్లు ఒకదానికొకటి కలిసిపోయి అధిక విద్యుత్ ప్రసారమై ఇళ్లల్లోని విద్యుత్ పరికరాలు కాలిపోయి వేల రూపాయల నష్టం వాటిల్లితుందని కానుకొల్లు వాసులు వాపోతున్నారు. జాతీయ రహదారి విస్తరణ పనులు మండవల్లిలో, కానుకొల్లులో నిర్వహిస్తున్నారు. గుత్తేదారుడు ముందుగా డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టాడు. పొక్లెయిన్‌తో డ్రెయినేజీ నిర్మించే క్రమంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో విద్యుత్ వైర్లు ఒకదానికొకటి కలిసిపోయి అధిక విద్యుత్ ప్రసారమై ఏసీలు, ఫ్రిజ్‌లు, కూలర్లు, గ్రైండర్లు, ట్యూబ్ లైట్లు, ఫ్యాన్లు, మోటార్లు మాడిపోయాయి. గుత్తేదారుడు నిర్వహిస్తున్న పనుల వల్లే అధిక విద్యుత్ ప్రసారమై ఇంట్లో కరెంటు సామగ్రి కాలిపోయాయని తెలుసుకొని గుత్తేదారుడని ప్రశ్నించగా ఇలాంటివి సర్వసాధారణంగా జరుగుతూనే ఉంటాయని తామేం చేయలేమని సమాధానం ఇచ్చాడు. విస్తరణ పనులను గుత్తేదారుడు నిర్లక్ష్యంగా నిర్వహిస్తున్నాడని, ప్రమాదాలు జరగకముందే పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, వాహనదారులు కోరినప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మండవల్లిలో నిర్వహిస్తున్న విస్తరణ పనుల వల్ల మంచినీటి పైపులు పగిలిపోయి గ్రామంలోని ప్రజలకు తాగునీరందక నాన్న అవస్థలు పడుతున్నామని, విద్యుత్ పరికరాలు కాలిపోయి వేల రూపాయల నష్టం వాటిల్లినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమంటున్నారు. విస్తరణ పనులను నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న గుప్తేదారుడిపై పనులు పర్యవేక్షించని అధికారులపై చర్యలు తీసుకునేలా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని బాధితులు గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బాధితులకు నష్ట పరిహారం ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై విద్యుత్ శాఖ ఎఇ రామకృష్ణను వివరణ కోరగా కానుకొల్లులో నిర్వహిస్తున్న జాతీయ రహదారి విస్తరణ పనుల వల్ల విద్యుత్ వైర్లు కలిసిపోయి అధిక కరెంటు ప్రసారమై ఇళ్లల్లోని కరెంటు మీటర్లతో పాటు విద్యుత్ పరికరాలు కాలిపోయిన మాట వాస్తవమేనని అన్నారు. గుత్తేదారుతో మాట్లాడి చలానా కట్టించి విద్యుత్ మీటర్లను అమర్చామని తెలిపారు. మండవల్లిలో జరిగిన సంఘటన తన దృష్టికి రాలేదని తెలిపారు.

పాఠశాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - భీమడోలు

పొలసానిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో విద్యావ్యాప్తికి ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు అందిస్తున్న సహాయ సహకారాలకు సర్పంచి షేక్ రహీమా బేగం హసేన కృతజ్ఞతలు తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలోని ఎంపిపి ప్రాథమిక పాఠశాల నెంబర్-1లో రూ.29 లక్షలు నాడు నేడు నిధులతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సర్పంచి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ గ్రామపంచాయతీ పరిధిలోని ఇతర పాఠశాలల అభివృద్ధికి నాడు నేడు నిధులను ఎంఎల్ఎ మంజూరు చేశారని తెలిపారు. ప్రస్తుతం శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పాఠశాల భవనాల మరమ్మతులు, ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.16 లక్షలు ఎంఎల్ఎ మంజూరు చేశారన్నారు. ఈ నేపథ్యంలో పాఠశాలకు అదనపు తరగతి గది ఆవశ్యకతను గుర్తించి, నిర్మాణానికి నిధులు మంజూరు కోసం ఎంఎల్ఎకు విజ్ఞప్తి చేశామన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎంఎల్ఎ తరగతి గదుల నిర్మాణానికి రూ.13 లక్షల నాడు- నేడు నిధులు అదనంగా మంజూరు చేశారన్నారు. వీటితో నిర్ణీత కార్యక్రమాలను పూర్తిస్థాయిలో చేపట్టేందుకు చర్యలు తీసుకున్నట్లు సర్పంచి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.తులసి శ్రీనివాసరావు, గ్రామ పరిధిలోని ఇతర పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మోహన్‌రావు, బాలభాస్కర్‌తో పాటు వైసిపి ఉంగుటూరు నియోజకవర్గ మైనార్టీ సెల్ నాయకులు, పారిశ్రామికవేత్త షేక్ హసేన, వైసిపి ప్రముఖులు సిహెచ్.మధు, అంబటి నాగేంద్ర ప్రసాద్, పంచాయతీ పాలకమండలి సభ్యులు రామకృష్ణ పాల్గొన్నారు.

నాడు- నేడు పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచి

ప్రజా సంక్షేమానికి కృషి : ఎంఎల్ఎ

ముసునూరులో...

ప్రజాశక్తి - ముసునూరు

సిఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పేరుతో ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకువచ్చారని నూజివీడు ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కొనియాడారు. మండలంలోని ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నూతన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్ రూ.2750కు పెంచామని, రైతు భరోసా, అమ్మఒడి, విద్యాదీవెన, విద్యావసతి ఇలా ఎన్నో సంక్షేమ పథకాలు పేద, బడుగు, బలహీన వర్గాల వారికి అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన విద్యావిధానంలో నూతన ఒరవడిని తీసుకువచ్చి నాడు- నేడు పనులు చేపట్టి ఆధునిక హంగులతో విద్యాలయాలు దేవాలయాల వలే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్, ఎంపిపి రాపర్ల కృష్ణకుమారి, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన, సర్పంచులు పేరం కృష్ణ, నక్కనబోయిన సత్యనారాయణ, రంగు ధనలక్ష్మిగాంధీ, చలసాని దామోదరరావు, వైస్ ఎంపిపి-2 పాముల గంగధరరావు, ఎంపిడిఒ జి.రాణి, తహశీల్దార్ దాసరి సుధ, రేగుల గోపాలకృష్ణ పాల్గొన్నారు.

గణపవరం :రాష్ట్రంలో అవ్వ తాతల ఆనందమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల శ్రీనివాసరావు(వాసుబాబు) అన్నారు. నూతనంగా మంజూరైన పెన్షన్లను స్థానిక కన్యకా పరమేశ్వరి వ్రత సంఘం భవనంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పేదల పక్షపాతి పార్టీ అని అన్నారు. అనంతరం సచివాలయ కన్వీనర్లతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లడానికి కన్వీనర్లు, వాలంటీర్లు కలిసి బాధ్యతగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి మోర అలంకారం, మండల పరిషత్ అధ్యక్షులు దండు వెంకటరామరాజు, జెడ్‌పిటిసి దేవవరపు సోమలక్ష్మి, వైసిపి నాయకులు దండు రాము, దేవవరపు బాబులు, రొంగల శ్రీను, ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి, సచివాలయ కార్యదర్శులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

చాట్రాయి : రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకంలో భాగంగా మండలానికి కొత్త పెన్షన్లు మంజూరయ్యాయి. చాట్రాయి మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం వద్ద గురువారం పెన్షన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ వైఎస్.జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా లోటు బడ్జెట్‌లో ఉన్నా కూడా సంక్షేమ పథకాలు ఆగకుండా అనుకున్న సమయానికి రాష్ట్రంలోని ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. వాలంటీర్లు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా తమ బాధ్యతను నిర్వర్తించాలన్నారు. అనంతరం చాట్రాయి మండలానికి మంజూరైన 224 వివిధ రకాల పెన్షన్లను ఎంఎల్ఎ చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, జెడ్‌పిటిసి సభ్యురాలు చెలికాని అనూష, ఎంపిపి లంక నిర్మల, గ్రామ సర్పంచి దామెర ఉష, ఎంపిటిసి సభ్యులు సంకు శివకుమారి, వైసిపి నాయకులు, గ్రామ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, ఎంపిడిఒ ఎన్.మురళీమోహన్, తహశీల్దార్ సిహెచ్.విశ్వనాధరావు పాల్గొన్నారు.

మండవల్లి : స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో సంవత్సరానికి పెన్షన్ నిమిత్తం రూ.4978 కోట్లు ఖర్చు పెట్టడానికి గగనమైందని, ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమం కోరి అర్హులందరికీ పెన్షన్ సకాలంలో ఇచ్చి ఆదుకునేలా నాలుగు రెట్లు పెంచి రూ.19500 కోట్లు పెన్షన్‌గా అందిస్తున్నారన్నారు. అనంతరం వివిధ రకాల పెన్షన్‌దారులకు పెన్షన్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్, వైస్ ఎంపిపి అగస్తి ఆదివిష్ణు, పార్టీ మండల అధ్యక్షులు గుమ్మడి వెంకటేశ్వరరావు, జెడ్‌పిటిసి సభ్యులు ముంగర విజయనిర్మల, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షురాలు జంగం వరలక్ష్మి, సర్పంచుల సంఘం అధ్యక్షులు బేతపూడి ఏసేబురాజు, మండవల్లి సర్పంచి మెండ ఝాన్సీ, రైతు సంఘం నాయకులు చేబోయిన, వీర్రాజు సొసైటీ అధ్యక్షులు గోకర్ణ యాదవ్, శివాలయ ఛైర్మన్ కొల్లా కృష్ణ, ఎంపిడిఒ పి.మల్లేశ్వరి పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి

అభీమడోలు : భీమడోలు గ్రామపంచాయతీ పరిధిలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వినియోగం మానేద్దాం- పర్యావరణాన్ని కాపాడదాం పేరుతో దుకాణాల్లో స్టిక్కర్లు అంటించే కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించినట్లు సర్పంచి పి.సునీతమాన్‌సింగ్ తెలిపారు. గ్రామపంచాయతీ కార్యదర్శి ఎన్.ఠాగూర్ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది ప్రతి దుకాణానికి వెళ్లి స్టిక్కర్లను అంటించే కార్యక్రమాన్ని నిర్వహించారని సర్పంచి తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బంది ప్లాస్టిక్ సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్, క్యారీ బ్యాగ్‌ల వినియోగాన్ని నిషేధించినట్లు వినియోగదారులకు తెలియజేయాలని కోరారు. చెత్తను నిర్ణీత ప్రదేశాల్లో ప్రత్యేకించిన కుండీల్లో వేయాలని వినియోగదారులకు సూచించాలని విజ్ఞప్తి చేశారు.

మహిళలకు చీరల పంపిణీ

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పెదపాలపర్రులో గంటా వెంకటరమణ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం పెదపాలపర్రులోని వంద మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఛైర్మన్ గంటా కిషోర్‌కుమార్ మాట్లాడుతూ తన తండ్రి పేరు మీద ట్రస్ట్ ఏర్పాటు చేసి ఎనిమిదేళ్లు పూర్తి అయిందన్నారు. తనతండ్రి గంటా వెంకటరమణ ఆశయాలు, ఆలోచనల ప్రేరణతో సమాజ ప్రగతికి, ప్రజల సంక్షేమం, పేద విద్యార్థుల అభ్యున్నతికి ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా స్థానికంగా ఉన్న రెండు పాఠశాలాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలు, స్టడి మెటీరియల్స్‌ను ప్రతి ఏటా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి గంటా రాకేష్‌కుమార్, గ్రామప్రముఖులు పాల్గొన్నారు.



మహిళలకు చీరలు అందిస్తున్న కిషోర్‌కుమార్

విద్యార్థులను ఇబ్బంది పెట్టడం సరికాదు

ప్రజాశక్తి - ముసునూరు

ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఎ-1 పరీక్షలు జరుగుతున్న సమయంలో ఎంఎల్ఎ ఆధ్వర్యంలో నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించి విద్యార్థులను ఇబ్బంది పెట్టడం సరికాదని టిడిపి తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రఘుబాబు అన్నారు. ఈ మేరకు ఎంపిడిఒ జి.రాణికి వినతపత్రం అందించారు. ఈ సందర్భంగా టిడిపి మండల నాయకులు పాకనాటి సీతారామ్ మాట్లాడుతూ ఇలాంటి పరీక్షల సమయంలో స్కూల్ ఆవరణలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని విషయం మర్చి, ఆర్భాటంగా మైకు సౌండ్‌లతో ,పెద్ద స్టేజులు ఏర్పాటు చేయడం సరికాదన్నారు. ముసునూరు ఉప సర్పంచి తోట శ్రీనివాసరావు, టిడిపి నాయకులు రేగుల ప్రకాష్ పాల్గొన్నారు.

డ్రెయిన్ శుభ్రం చేయరూ..!

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు పట్టణంలోని రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ఎదురుగా ప్రయివేట్ ఫొటో స్టాట్ వద్ద ఉన్న డ్రెయినేజీ చెత్తాచెదారంతో పూడుకుపోయి తీవ్ర దుర్గంధం వ్యాప్తి చెందుతోంది. నెలల తరబడి డ్రెయినేజీలో చెత్త పేరుకుపోయిందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రెయినేజీని శుభ్రం చేయాలని కోరుతున్నారు.

చెత్తతో పూడుకుపోయిన డ్రెయినేజీ

CHANGE OF NAME

I **VIDIYALA KRISHNAMURTHY** (NEW NAME),S/O.VIDIYALA RAMANNA , HOUSE.NO:2-108 , O.C.COLONY ,VELLAMILLI, OLD DIST W. G.DIST - NEW DIST ELURU, A.P-534 411 .IS HEREBY INFORMED TO THE PUBLIC BY PAPER PUBLICATION . THAT NOW CHANGED MY NAME **VIDIYALA KRISHNA** (OLD NAME) **VIDIYALA KRISHNAMURTY** (NEW NAME)TODAY ONWARDS USE MY NAME FOR ALL FURTHER TRANSACTIONS.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, ఉండి మండలం, కోలమూరు గ్రామ కాపురస్తులయిన ఇంటి గోపి, S/o. బుచ్చయ్య అను నేను నాయొక్క పాస్‌పోర్టు ఉండి నుంచి కోలమూరు బండిపై వస్తుండగా మార్గమధ్యలో బండికి ఉన్న పాస్‌పోర్టు కవరు ఎక్కడో పడిపోయినది. ఆ చుట్టుప్రక్కల అంతా వెతికి చూసాను. ఎక్కడ కనిపించలేదు. నా పాస్‌పోర్టు నెంబర్ **P9982574.** కావున పాస్‌పోర్టు దొరికినవారు ఈక్రింది ఫోన్ నెంబరుకు తెలియజేయవలసిందిగా కోరుచున్నాము.

ఇంటి గోపి, S/o. బుచ్చయ్య
కోలమూరు, ఉండి మండలం
ప॥గో॥జిల్లా, సెల్: 9989242121

పాస్‌పోర్టు పోయినది

ఏలూరు జిల్లా, గణపవరం మండలం, ముగ్గళ్ళ గ్రామ కాపురస్తులయిన బుత్తల లక్ష్మీ భారతి, W/o. వెంకటేశ్వరరావు అను నేను నాయొక్క పాస్‌పోర్టు ముగ్గళ్ళ నుండి గణపవరం మోటార్ సైకిల్‌పై వెళ్ళే దారిలో నా పాస్‌పోర్టు ఉన్న కవరు పడిపోయినది. పాస్‌పోర్టు నెంబర్ **N2885825** గల పాస్‌పోర్టు దొరికినవారు ఈక్రింది ఫోన్ నెంబరుకు తెలియజేయవలసిందిగా కోరుచున్నాము.

బుత్తల లక్ష్మీ భారతి
భర్త: వెంకటేశ్వరరావు
ముగ్గళ్ళ, గణపవరం మండలం
ఏలూరు జిల్లా, ఫోన్: 9966248330

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, తణుకు మండలం, దువ్వ గ్రామానికి చెందిన తోట అమ్మిరాజు, S/o. వెంకటేశ్వరరావు పాస్‌పోర్టు నెంబర్ **K2275822** గ్రామం నుండి తణుకు వెళ్తుండగా మార్గ మధ్యలో పడిపోయినది. దొరికినవారు క్రింది అడ్రస్‌కు అందచేయగలరు.

అడ్రస్: తోట అమ్మిరాజు
S/o.వెంకటేశ్వరరావు, హౌస్ నెం. 8-86,
10వ వార్డు, సంత మార్కెట్, దువ్వ,
తణుకు మండలం-534156, ప॥గో॥జిల్లా,
ఫోన్: 9951792911

<u>నోటీసు</u>

మహారాజశ్రీ కొవ్వూరు 2వ అదనపు జ్యుడిషల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టులో

Crl.M.P. No. 711/2020
C.C.S.r.No. 473/2020

Between:

1. ముత్యాల మధుబాబు -పిటీషనర్/ఫిర్యాది

మరియు

1. నందమూరి వెంకన్న, తండ్రి: మస్తాన్, ఫీల్డ్ ఆపరేటర్ ఇన్ ఓ.యన్.జి.సి., ప్లాట్ నెం. 52, రుస్తుంబాద, హౌసింగ్ బోర్డు కాలనీ, నరసాపురం, నరసాపురం మండలం, పశ్చిమగోదావరి జిల్లా.

-రెస్పాండెంటు/ ముద్దాయి

పై నెంబరు కేసులో రెస్పాండెంటు/ ముద్దాయి అయిన మీకు ఎన్నిసార్లు సమన్లు రిజిష్టర్డు పోస్టులోను మరియు శ్రీ కోర్టు వారి ద్వారానూ పంపించుచున్నప్పటికీ వాటిని మీరు తీసుకొనకుండా ఉద్దేశ్యపూర్వకంగా నిలువరించుచున్నారు. కావున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ది. **24-01-2023వ తేదీ ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారి సమక్షమున స్వయంగా హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేది: 24-01-2023

స్థలం: కొవ్వూరు **కె.వి.వి.హరిమోహన్**
తేది:05-01-2023 అడ్వకేట్, కొవ్వూరు

In the Court of the I Additional Junior Civil Judge, Tanuku
O.S. 286/2020

Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank), Alamuru ***...Plaintiff***
Vs
Tholeti Venkata Krishnarao and Other ***...Defendants***

<u>వాది తరుపున చేసిన ప్రకటన</u>

ప్రతివాదులు:

1. తోలేటి వెంకట కృష్ణారావు, S/o. నాగరాజు, హిందువు, పురుషుడు, 50 సం॥లు, పాలకొల్లు.
2. వేముల వెంకటలక్ష్మి, W/o. వర్ధనరావు, హిందువు, స్త్రీ, 34 సం॥లు, పాలకొల్లు.

పై నెంబరు దావా గ్రంథములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు ది. **06-1-2023 తేదీన ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయముగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను, అట్లుకాని యెడల మీపై పరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియపర్చడమైనది.

N.RAVI SHANKAR
Advocate, Tanuku

In the Court of the I Additional Junior Civil Judge, Tanuku
O.S. 655/2020

Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank), Alamuru ***...Plaintiff***
Vs
Midde Venkateswara and Other ***...Defendants***

<u>వాది తరుపున చేసిన ప్రకటన</u>

ప్రతివాదులు:

1. మిద్దే వెంకటేశ్వరరావు, S/o. గంగయ్య, హిందువు, పురుషుడు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.
2. తొంట జయలక్ష్మి, W/o. శ్రీనివాసరావు, హిందువు, స్త్రీ, పాలకొల్లు.

పై నెంబరు దావా గ్రంథములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు ది. **06-1-2023 తేదీన ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయముగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను, అట్లుకాని యెడల మీపై పరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియపర్చడమైనది.

D.S.V.KRISHNAJI
Advocate, Tanuku

In the Court of the I Additional Junior Civil Judge, Tanuku
O.S. 592/2020

Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank), Alamuru ***...Plaintiff***
Vs
Borra Prakasha Rao and other ***...Defendants***

<u>వాది తరుపున చేసిన ప్రకటన</u>

ప్రతివాదులు:

1. బొర్రా ప్రకాశరావు, S/o. వెంకటేశ్వరరావు, హిందువు, పురుషుడు, 50 సం॥లు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.
2. వేముల సూర్య వంశీధర్, S/o. చంద్రశేఖర్, హిందువు, పురుషుడు, 38 సం॥లు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.

పై నెంబరు దావా గ్రంథములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు ది. **06-1-2023 తేదీన ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయముగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను, అట్లుకాని యెడల మీపై పరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియపర్చడమైనది.

T.RAMADEVI
Advocate, Tanuku